బిల్లులు రాక ఏజెన్సీల పాట్లు

- నాలుగు నెలలుగా నిలిచిన మధ్యాహ్న భోజన వంట బిల్లులు
- గౌరవ వేతనాలూ సకాలంలో అందక ఏజెన్సీల ఆవేదన
- ఆరు నెలలుగా గుడ్ల బిల్లులు కూడా పెండింగ్‌లోనే..


అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనం కోసం క్యూకట్టిన విద్యార్థులు

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే ఏజెన్సీలకు బిల్లులు సకాలంలో రాక ఇబ్బందుల పాలవుతున్నారు. ఇప్పటికే కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీనికి తోడు బిల్లులు రాకపోవడంతో ఏజెన్సీల మహిళలు ఆవేదన చెందుతున్నారు. మధ్యాహ్న భోజన బిల్లులు, గౌరవ వేతనాలు, కోడి గుడ్ల బిల్లులు సకాలంలో అందడం లేదు. పాఠశాలల్లో పిల్లలకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అధికారులు ఓ వైపు ఏజెన్సీలపై ఒత్తిడి తెస్తుండటంతో మహిళలు వంట విషయంలో రాజీ పడకుండా పిల్లలకు రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నారు. కానీ నెలల తరబడి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అప్పులు చేయాల్సి వస్తోందని ఏజెన్సీ నిర్వాహకులు వాపోతున్నారు.

బిల్లులన్నీ పెండింగ్‌లోనే..

జాజిరెడ్డిగూడెం మండలంలో 32 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 2 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే 32 ఏజెన్సీలకు చెందిన 56 మంది మహిళలు వంటలు చేస్తున్నారు. అయితే 4 నెలల వంట బిల్లులు వీరికి రావాల్సి ఉంది. అలాగే 6 నెలలుగా కోడి గుడ్ల బిల్లులు రావడం లేదు. మూడు నెలల నుంచి గౌరవ వేతనాలు కూడా చెల్లించని పరిస్థితి నెలకొంది. కాగా వీరికి నెలకు రూ. 3వేల చొప్పున గౌరవ వేతనాలు రావాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులన్నీ వెంటనే చెల్లించాలని ఏజెన్సీ నిర్వాహకులు కోరుతున్నారు.

బిల్లులు చెల్లించి ఆదుకోవాలి



అధికారులు మధ్యాహ్న భోజన వంట బిల్లులను వెంటనే చెల్లించి ఆదుకోవాలి. నాలుగు నెలల నుంచి వంట బిల్లులు, ఆరు నెలల నుంచి కోడి గుడ్ల బిల్లులు రావడం లేదు. దుకాణాల్లో వ్యాపారుల వద్ద అప్పులు చేసి సరుకులు తెచ్చి పాఠశాలల్లో పిల్లలకు భోజనం వండి పెడుతున్నాం.

– దావుల లక్ష్మమ్మ, ఏజెన్సీ నిర్వాహకురాలు

గౌరవ వేతనాలు రావడం లేదు



వంటల బిల్లులతో పాటు గౌరవ వేతనాలు కూడా రావడం లేదు. దీంతో మాకు ఏజెన్సీ నడపడం కష్టంగా మారింది. బిల్లులు రాక పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలంటే ఇబ్బందిగా మారింది. మధ్యాహ్న భోజన బిల్లులను నెలనెలా చెల్లించి ఇబ్బందులు కాకుండా చూడాలి.

– నోముల సైదమ్మ, ఏజెన్సీ నిర్వాహకురాలు

క్లుప్తంగా

ఎమ్మార్పీఎస్ టీఎస్ పట్టణ అధ్యక్షుడిగా ప్రశాంత్


నియామకపత్రం అందుకుంటున్న ప్రశాంత్

భానుపురి : ఎమ్మార్పీఎస్ టీఎస్ సూర్యాపేట టౌన్ అధ్యక్షుడిగా కనుకు ప్రశాంత్ గురువారం ఎన్నికయ్యారు. ఈ మేరకు సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన టౌన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ పల్లేటి లక్ష్మణ్ మాదిగ నియామకపత్రం అందజేశారు. అలాగే పట్టణ ఉపాధ్యక్షుడిగా వల్దాస్ మహేందర్, ప్రధాన కార్యదర్శిగా కనుకు రాజేష్, కోశాధికారిగా పాల్వాయి భరత్, కార్యదర్శులుగా వల్దాస్ వెంకటాద్రి, వల్దాస్ మురళిలను ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనుక రాజు, పాల్వాయి పండు, యాతకుల సన్నీ, వల్దాస్ యశ్వంత్, నగరికంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్‌డే

భానుపురి : జమ్మిగడ్డలోని సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి 10.30గంటల వరకు విద్యుత్ గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నట్లు సూర్యాపేట టౌన్ –1 ఏఈ సురేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యుత్ అధికారి, డివిజన్ విద్యుత్ అధికారి ఈ గ్రీవెన్స్ డేలో పాల్గొంటారని తెలిపారు. కావున వినియోగదారులు విద్యుత్‌పై ఏమైనా సమస్య ఉంటే గ్రీవెన్స్ డేలో తెలపాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం అర్వపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతుందని ఎంపీడీఓ కతురోజు ఉమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ హాజరు కానున్నారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ముగిసిన గోవింద మాల మండల దీక్ష


సుదర్శన హోమంలో పాల్గొన్న దీక్షపరులు

భానుపురి : జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోవింద మాల భక్త బృందం ఆధ్వర్యంలో గురువారం సుదర్శన హోమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం గోవింద మాల భక్తులు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనార్థమై ముడుపులు ధరించి తిరుపతికి బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో గుండా శ్రీనివాస్, దంతాల నాగరాజు, బూర నాగరాజు, దంతాల శేఖర్, రేగటి సైదులు గౌడ్, రామ్ రెడ్డి, శ్రీనివాసరెడ్డి, లంకెల మట్టయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా అటెండర్‌పై దాడి..?

చివ్వెంల : మహిళా అటెండర్‌పై పీఆర్ ఏఈ దాడికి పాల్పడిన ఘటన సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న జయంతిని, మండల పంచాయతీరాజ్ శాఖ ఏఈ లింగానాయక్ కొట్టాడండూ సోషల్ మీడియాలో కొందరు పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. ఈ విషయమై అటెండర్ ధరావతు జయంతిని వివరణ కోరగా కార్యాలయంలో పనులు చేసుకుంటుండగా, ఆఫీస్‌కు వచ్చిన ఏఈ అకారణంగా ఘర్షణ పడి కొట్టాడని ఆరోపించింది. అదే విధంగా ఏఈ లింగానాయక్‌ను వివరణ కోరగా తాను అటెండర్ జయంతితో ఎప్పుడు మాట్లాడలేదని, గొడవకు తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు.

లోగో ఆవిష్కరణ

కోదాడఅర్బన్ : ముస్లిం మైనార్టీ ఎంప్లాయిస్ అండర్ గైడర్స్ అసోసియేషన్ (ఎంఎంఈజీఏ–మెగా) లోగోను స్థానిక కౌసర్‌నగర్‌లో ఉన్న మెగా కార్యాలయంలో అసోసియేషన్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోదాడ నియోజకవర్గ ముస్లిం మైనార్టీ ఉద్యోగస్తుల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ సలహాదారుడిగా రిటైర్డ్ ఉద్యోగులు ఎండీ గులాంయజ్దాని, ఎండీ జాఫర్, తాత్కాలిక క్యావర్గ సభ్యులుగా షేక్ జానీపాషా, షేక్ మోయినుద్దీన్, షేక్ సాహెబ్ అలీ, పఠాన్ ఫజులుల్లాఖాన్, షేక్ ఖమర్ సుల్తానా, మహమ్మద్ ఖాన్‌సాబ్, ఎండీ ముస్వీర్‌ను ఎన్నుకున్నట్లు ఎండీ గులాంయజ్దాని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఐదవ రోజు గురువారం మహిళలు కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే కీర్తనలతో స్వామిని స్మరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.


కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

ఓటరు నమోదుపై బీఎల్‌ఓలకు శిక్షణ


బీఎల్‌ఓలకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్ అశోక్‌రెడ్డి

నాగారం : నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణలపై గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్ (ఏఎల్ఎంటీ) అశోక్‌రెడ్డి మాట్లాడారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. జాబితాలో ఓటరు నమోదుపై ఉన్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని, మరణించిన వారి పేర్లను తొలగించాలని, వలస ఓటర్లను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఏఎల్ఎంటీ సత్యనారాయణరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఉప్పలయ్య, ఏఆర్ఐ గోపయ్య, బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతిని పెంచాలి


మాట్లాడుతున్న సీహెచ్ రాములు

పెన్‌పహాడ్ : ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల ప్రగతిని పెంచాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ రాములు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పాఠశాలలు స్కావెంజర్లు లేకుండా నడుస్తున్నాయని, పాఠశాలల్లో ఊడ్చేవారు, తాళాలు తీసే వారు లేరన్నారు. పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. నూతన ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని అన్నారు. మహాసభలో జిల్లా కార్యదర్శి మైలారపు వెంకన్న, మండల అధ్యక్షుడు బి. రాంజీ, ప్రధాన కార్యదర్శి బండ్ల రమేష్, కోశాధికారి వీరేందర్, గోవిందు, వెంకటేశ్వర్లు, గోపి పాల్గొన్నారు.

కోవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

అర్వపల్లి : కోవిడ్ పాజిటివ్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ చిలుకూరి మణిదీప్ కోరారు. కోవిడ్, న్యుమోనియా తదితర వ్యాధులపై గురువారం స్థానిక పీహెచ్‌సీలో జరిగిన వైద్యసిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజలకు దగ్గు, జలుబు, ఆయాసం ఏవైనా వస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం పొందాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తప్పని సరిగా మాస్కులు ధరించాలని, ఎప్పటికప్పుడు చేతులు శుభ్రం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సీహెచ్‌ఓ ఎల్. చరణ్, సూపర్‌వైజర్ సంధ్యారాణి, ఎంఎల్‌హెచ్‌పీలు వాణి, గౌతమి, వస్రిత, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మణిదీప్

మౌలిక భాష, గణిత సామర్థ్యాల పరిశీలన


సీతారాంపురంలో పాఠ్య బోధనను పరిశీలిస్తున్న మండల నోడల్ అధికారి, ఆర్‌పీ

అర్వపల్లి : బొల్లంపల్లి, సీతారాంపురం, పర్సాయపల్లి ప్రాథమిక పాఠశాలల్లో మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధన అమలును గురువారం ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి డి.యల్లయ్య పరిశీలించారు. వర్క్ పుస్తకాల వినియోగం, పాఠ్యాంశాల బోధన తదితర విషయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో రీసోర్స్‌పర్సన్ యోగాచార్య, డాక్టర్ పగిళ్ల సైదులు, హెచ్ఎంలు వెంకటేశ్వర్లు, మోర ఆనంద, కుర్ర శ్రీను, ఉపాధ్యాయులు సురేందర్, శోభ, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

బకాయి బిల్లులు వెంటనే చెల్లించాలి

అర్వపల్లి : వ్యవసాయ విద్యుత్ సర్వీస్ చార్జీల బకాయిలను రైతులు వెంటనే చెల్లించాలని విద్యుత్ ఏఈ వి. శ్రీకాంత్ కోరారు. అర్వపల్లిలో కొంతమంది రైతులు విద్యుత్ సర్వీస్ చార్జీలు చెల్లించకపోవడంతో గురువారం ఇంటింటికీ తిరిగి వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు నెలకు రూ. 30 సర్వీస్ చార్జీ చెల్లించాలని సూచించారు. మండల వ్యాప్తంగా సుమారు రూ. 15లక్షలు బకాయిలు చెల్లించాల్సి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు జ్యోయల్, వెంకటేశ్వర్లు, లైన్‌మెన్ రాజేష్, జేఎల్ఎం గంగరాజు, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.


బకాయిలను వసూలు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే


సర్వే చేస్తున్న ఐఈఆర్‌పీ వినీత

అర్వపల్లి : మండల పరిధిలోని పలు గ్రామాల్లో బడి బయటి పిల్లల గుర్తింపు సర్వే కొనసాగుతోంది. గురువారం ఉయ్యాలవాడ, కుంచమర్తి క్రాస్‌రోడ్, అడివెంల, కుంచమర్తి తదితర గ్రామాల్లో ఐఈఆర్‌పీలు వినీత, ఇందు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించారు. బడి ఈడు పిల్లలను, బడి మానేసిన పిల్లలను గుర్తించి వివరాలను ప్రబంద్ పోర్టల్‌లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. ఈ పిల్లలను సమీపంలోని పాఠశాలల్లో చేర్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నేడు నిరసనలు

అర్వపల్లి : పార్లమెంట్ సభ్యులను అప్రజాస్వామికంగా సస్పెండ్ చేసిన కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ చర్యలను వ్యతిరేకిస్తూ శుక్రవారం దేశవ్యాప్తంగా నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌లో ఇటీవల జరిగిన పొగ బాంబు ఘటనకు సంబంధించి చర్చించాలని కోరిన 141 మంది ఎంపీలను సస్పెండ్ చేయడం తగదన్నారు. ఇందుకు నిరసనగా జరిగే ఆందోళన కార్యక్రమాల్లో ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, రాజకీయ నాయకులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తాం

చిలుకూరు : విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని సూర్యాపేట జిల్లా విద్యుత్ ఎస్‌ఈ సీహెచ్.పాల్‌రాజ్ అన్నారు. గురువారం చిలుకూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొని వినియోగదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే సాధ్యమైనంత వరకు పరిష్కారం చేస్తామని అన్నారు. చిలుకూరులోని హరిజనవాడ కాలనీలో కరెంట్ తీగలు ఏర్పాటు చేసి అనేక ఏళ్లు గడుస్తోందని, దీంతో తీగలు తెగి కింద పడుతున్నాయని, తమ సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీవాసులు ఎస్‌ఈకి వినతిపత్రం అందజేశారు. దీంతో ఎస్‌ఈ స్పందించి సిబ్బందితో కలిసి హరిజనవాడలోని కరెంట్ స్తంభాలు, తీగలను పరిశీలించారు.

విచారణ జరిపించాలని వినతి


ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న క్లబ్ సభ్యులు

భానుపురి : సూర్యాపేట పట్టణంలోని పబ్లిక్ క్లబ్ కార్యవర్గం నిధుల వినియోగంపై సమగ్ర విచారణ చేసి కార్యదర్శి, కోశాధికారులపై చర్యలు తీసుకోవాలని సీనియర్ సభ్యులు నూకల సుదర్శన్ రెడ్డి, బొల్లెద్దు దశరథ కోరారు. అక్రమాలు, నిధుల దుర్వినియోగం, నిధుల స్వాహాపై విచారణ జరపాలని, పబ్లిక్ క్లబ్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయాలని, ప్రస్తుత కమిటీని రద్దు చేసి నూతన కమిటీని నియమించాలని పబ్లిక్ క్లబ్ సభ్యులు గురువారం పబ్లిక్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు, సూర్యాపేట ఆర్డీఓ వీరబ్రహ్మ చారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పబ్లిక్ క్లబ్‌కు ప్రతి నెలా దుకాణాల అద్దె, ఆడిటోరియం అద్దెల ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం వస్తుందని తెలిపారు. కానీ ప్రస్తుత కార్యదర్శి అక్రమాలకు పాల్పడ్డారని, క్లబ్‌కు సంబంధం లేని రంగస్థల పద్యాలు, భరత నాట్యాలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ లక్షలాది రూపాయలు స్వాహా చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులు ఎల్గూరి చంటిబాబు, శనగాని రాంబాబు గౌడ్, చెంచల శ్రీనివాస్, కక్కిరేణి శ్రీనివాస్, పొలగాని బాలు గౌడ్, పిండిగ విజయ్ కుమార్, యండీ. ఫరీదోద్దీన్, పోలెబోయిన నర్సయ్య, రమేష్, రవి, కృష్ణారెడ్డి, లింగయ్య, కుందమల్ల శేఖర్, సయ్యద్ ఖమ్రుద్దీన్, శ్రీనివాస్ గౌడ్, శేషయ్య, రాంబాబు, సాయినేత, గుణగంటి సైదులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి లేదు


తిరుమలగిరిలో మాట్లాడుతున్న పేరాల వీరేష్

తిరుమలగిరి : ముఖ్యమంత్రిని, ఎమ్మెల్యే మందుల సామేల్‌ను విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ తిరుమలగిరి పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్ అన్నారు. గురువారం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గాదరి కిషోర్‌కుమార్ ఇంకా ఎమ్మెల్యే అనుకొని ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ జెమ్మిలాల్, సుంకరి జనార్దన్, కందుకూరి లక్ష్మయ్య, దాచేపల్లి వెంకన్న, హీరూనాయక్, సుధాకర్, గణేష్ పాల్గొన్నారు.

వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి..

మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్‌పై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్ఎస్‌యూవి అధ్యక్షుడు కందుకూరి అంబేద్కర్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి సంతోష్, జిల్లా కార్యదర్శి గణేష్, వెంకటేష్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ అనుదీప్, రాఖేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

తుంగతుర్తి : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్‌పై మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు దొంగరి గోవర్దన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు తిరుమల ప్రగడకిషన్ రావు, నాయకులు ఓరుగంటి సత్యనారాయణ, పెండెం రాంమూర్తి, పెద్దబోయిన అజయ్, తిరుమలప్రగడ రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఎమ్మెల్యే మందుల సామేల్‌పై చేసిన తప్పుడు వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి డిమాండ్ చేశారు. గురువారం అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేల్పుల రమేష్, నిద్ర సంపత్, మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో తిరుగనివ్వరు

మద్దిరాల : మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడకుంటే దళిత ప్రజలు నియోజకవర్గంలో తిరుగనివ్వరని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బర్పటి ఉపేందర్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా నాయకులు కొమ్ము అంజయ్య, కొమ్ము వెంకన్న, సుంచు విజయ్, పాల్వాయి సురేష్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్‌పై మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బాషపంగు భాస్కర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దరిపెల్లి వీరన్న, పాల్వాయి నాగరాజు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఇంకుడు గుంతలు

- గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలకు ప్రభుత్వ ప్రోత్సాహకం
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెన్‌పహాడ్ : సకల ప్రాణకోటికి నీరే జీవనాధారం. అలాంటి నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉంది. నీటి వృథాను అరికట్టకుంటే భవిష్యత్ తరాలకు నీరులేక ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఇలాంటి పరిస్థితులు తలెత్తక ముందే వృథా నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకేలా చూడాలని అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం జలశక్తి అభియాన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పల్లెల్లో ఇంకుడుగుంతల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. వాటి ఏర్పాటుకు రూ.4200 ప్రోత్సాహకాన్ని లబ్ధిదారులకు అందిస్తుంది. ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను ఏర్పాటు చేయడం ద్వారా వృథా నీరంతా భూమిలోకి చేరి భూగర్భజలాలు పెరుగుతాయి. ఫలితంగా నీటి ఎద్దడి తలెత్తకుండా ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు.

పెన్‌పహాడ్ మండలంలో ఇలా..


పెన్‌పహాడ్ మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో ఇంటింటా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు చాలా చురుగ్గా కొనసాగుతున్నాయి. మండలంలో ఇప్పటివరకు మొత్తం 1628 నిర్మాణాలు మంజూరయ్యాయి. వాటిలో 987 ఇంకుడు గుంతలు పూర్తి కాగా మరికొన్ని వివిధ దశల్లో పనులు కొనసాగుతున్నాయి. ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.


పొట్లపహాడ్‌లో నిర్మించిన ఇంకుడు గుంత

శాస్త్రీయ పద్ధతిలో నిర్మాణాలు..

ఇంకుడు గుంతలను శాస్త్రీయ పద్ధతిలోనే నిర్మించాలి. నీరు వృథాగా పోకుండా వర్షపు నీరు సైతం చేరేలా ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతను ఏర్పాటు చేయాలి. 4 అడుగుల వెడల్పు, 4 అడగుల పొడవు, 6 అడగుల లోతుగా గుంతను తీయాలి. 3 అడుగుల కింద భాగాన్ని పెద్ద పెద్ద రాళ్లతో నింపాలి. ఒక సిమెంట్ గొళ్లెం తీసుకొని పై భాగంలో సరిపడ రంధ్రాలు చేసి గుంత మధ్య భాగంలో అమర్చాలి. ఇక గుంతలో మిగిలిన భాగం 3ఫీట్ల లోతును 45ఎంఎం కంకరతో మొత్తం నింపాలి. గుంత పూర్తయ్యాక వర్షపు నీరు వృథాగా పోకుండా పైపు ద్వారా గోతిలోకి పోయే విధంగా చూసుకోవాలి. తద్వారా ఇంకుడు గుంత ఎప్పటికప్పుడు వృథానీరు తీసుకొని భూగర్భజలాలను పెంచేలా చేస్తుంది.

త్వరలోనే లక్ష్యాన్ని చేరుకుంటాం



ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని గ్రామాల్లో నిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఇంటి ముందు ఇంకుడుగుంత నిర్మించుకోవాలి. త్వరలోనే వందశాతం ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టి లక్ష్యాన్ని చేరుకుంటాం.

– రవి, ఏపీఓ

చెవిటి వెంకన్న యాదవ్‌కు ఎంపీ టికెట్ కేటాయించాలి


మాట్లాడుతున్న పసుల అశోక్ యాదవ్

నూతనకల్ : భువనగిరి పార్లమెంట్ స్థానాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నకు కేటాయించాలని బీసీ జిల్లా యువజన సంఘం అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఉదయపూర్ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నాయకులు నెల్లుట్ల మహేష్, బంటు బద్రి, చెవిటి సూర్యం, ఇరుగు కిరణ్, బొల్క సైదులు, జటంగి గణేష్, ఇరుగు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.41.41 లక్షలకు సంతవేలం

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో గురువారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో పశువుల సంత వేలం నిర్వహించారు. డీఎల్‌పీఓ సాంబిరెడ్డి సమక్షంలో నిర్వహించిన వేలంలో గ్రామానికి చెందిన సైదులు రూ.41,41,516లకు సంతను దక్కించుకున్నాడు. గత సంవత్సరం రూ.36,36,222లకు వేలం కాగా.. ఈ ఏడాది రూ.5లక్షలు అదనంగా సమకూరాయి. కార్యక్రమంలో ఎంపీఓ సంజీవయ్య, సర్పంచ్ గంపల దావీదు, ఎంపీటీసీ ఎడవల్లి ముత్తయ్య, పంచాయతీ కార్యదర్శులు హరికృష్ణ, షమీ, సుధాకర్, వేలం పాటదారులు పాల్గొన్నారు.


వేలం నిర్వహిస్తున్న అధికారులు

యాసంగి పంటలకు ఎస్సారెస్పీ నీరందించాలి

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం యాసంగి పంటలకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా నీటిని విడుదల చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే యాసంగి పనులు ప్రారంభమై, రైతులు నాట్లు వేసుకునేందుకు సన్నద్ధమవుతున్నారని తెలిపారు. నేటికీ ప్రభుత్వం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళనలు చెందుతున్నారని అన్నారు. రైతుబంధు సాయాన్ని రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు. ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని, ఎస్సారెస్పీ కాలువలకు గండ్లు పడకుండా సిమెంట్ లైనింగ్ చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయలేని పక్షంలో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఆయనతో పాటు ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య, ధనుంజయ్, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సవరించాలి


నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న డీఎస్పీ నాయకులు

నూతనకల్ : మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ప్రభుత్వం కల్పించిన ఉచిత ప్రయాణాన్ని సవరించాలని కోరుతూ ధర్మసమాజ్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో నాయబ్ తహసీల్దార్ శ్రీధర్ నాయక్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న మహిళలకు మాత్రమే ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించాలని, ఆటో డ్రైవర్లకు నెలకు రూ. 3వేలు అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కమిటీ నాయకులు బాలు, లింగరాజు, శ్రీహరి, పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

పెన్‌పహాడ్: వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన బుధవారం రాత్రి పెన్‌పహాడ్ మండల పరిధిలోని మహ్మదాపురం ఆవాసం లాల్‌సింగ్ తండాలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకన్నగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. లాల్‌సింగ్ తండాకు చెందిన బానోతు రవీందర్, అదే తండాకు చెందిన భూక్య మురారీ బంధువులు. వీరి మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి మురారీ, లాల్ సింగ్ తండాకే చెందిన గోవింద్ కలిసి రవీందర్‌పై కత్తితో దాడి చేయడంతో అతడి చెయ్యికి గాయాలయ్యాయి. దీంతో అతడిని చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.